# రాగబంధాలు! - - -

మూలం : చిల్లా సత్యనారాయణ రెడ్డి ♦ రూపకల్పన : చిదానందశ్రీ - సత్యశ్రీ

అగాధ నిశీధిలో ప్రకృతి చలన రహితయే అయింది. ఆవరించిన నిశ్శబ్ధతలో మలయ సమీరము వింజామరం వీస్తున్నట్లేవుంది. నిద్రామైకంలో ఒళ్లు తెలీని జనాళి ఒక్కసారిగా ఆవులించింది!

ఎదలో బాధలు పేరుకుపోయిన ఓ మానవ హృదయం, నైరాశ్యంగా నిట్టూర్పు విడిచింది. మస్తిష్కంలో ఆలోచనలు అణుకణువునా కలచి వేస్తున్నాయి! విడనాడని బాధల భారంతో ఆక్రోషించింది ... హృదయం.

క్షణికం తనపై తనకే ఏవగింపూ కల్గింది. క్షుభిత మనస్కుడే అయ్యేడు! శ్వాస వడి వడిగానే సాగుతున్నా,—గుడి గంటల ప్రతిధ్వనిలా...ఆలోచనలు మాత్రం మదిలో సుడులుగానే తిరుగుతున్నాయి!! నిద్రయేనాడో పదవీ విరమణ చేసుకుంది.

భారంగా కళ్ళు మూసాడు సుందర్! అనుక్షణం—అతనినేదో సమస్య కలవర పెడుతూనే వుంది.

''ఆర్మీలో జాయిన్ అయి—మాతృదేశ పరిరక్షణ కొరకు ఎలాంటి త్యాగమ్నయినా చేయాలని, భీష్మించుకుంది అతని ఆత్మ! అయినా తను ఆరేండ్ల ''విశాల''ను ఈ సువిశాల ప్రపంచంలో ఎలా వదిలి వెళ్ళగలడు? మబ్బులమధ్య మధన పడుతున్న జాబిల్లిలా వ్యథ చెందుతున్నాడు సుందర్!

ఆలోచనల ఉద్విగ్ధత...ప్రస్ఫుటమయ్యే ఆవేదనలో అతని అంతరంగంలో అంతులేని అలజడిని రేపాయి...! అంతలో సన్నటి గొంతుక......

''అన్నాయ్! అన్నాయ్!'' ఆరాటం వ్యక్తమౌతోంది. సుందర్...తన ఉలికిపాటే... చెల్లాయ్ మంచం చెంతకు నడిపించింది. వంగి చూశాడు. కలవరింపే!!

''అన్నాయ్! మరేం......నాకో చిన్న సైకిలు కొనియ్యవ్? స్వరంలో ధైన్యత గోచరిస్తుంది అస్పష్టమై!

సన్నటి దీపపు వత్తి రెపరెపమంటూ కొట్టుకుంటోంది తన జీవితపు నావలా!

చెల్లాయి కలవరింపు గుండెల్ని పొడిచి పొడిచి పిప్పి చేస్తోంది...తనపై విధి ప్రభావంలా!?

పాప కనుకొలకులలో అశ్రుకణాలు కెంపుల్లా మెరుస్తున్నాయి...తన ధైర్యంలా!!

మానవజీవిత ప్రమాణంగా తన జీతంకూడ అతి స్వల్పం! తన కష్టానికి ప్రతిఫలం 60 రూపాయలు! రోజూ అన్నంపెట్టే అయ్యరుకు ముప్పయి రూపాయలు ఇవ్వడం సబబుగానే వుందిగాని...డాక్టరుగారు 20 రూ॥ ఎందుకు తీసుకుంటునట్టు? తనాయన కేమీ అప్పు లేదు. అయినా...హే భగవాన్ తన గత జీవితం ఎలాంటిది?...

* * *

సుందరామయ్యగారు అప్పట్లో ఓ ఆఫీసరు. ఓనాడు హఠాత్తుగా సుందర్ తల్లిలేని వాడయ్యాడు. తల్లీ తండ్రీ కూడా నాన్నగారే అయ్యేరు. సుందర్ చదువు కాన్వెంట్‌లో కొనసాగుతోంది.

''తెప్పలుగ చెఱువునిండిన, కప్పలు పదివేల చేరు' అన్నట్లు రకరకాల మిత్రులతో ఇల్లు చాలేదికాదు. కొన్నాళ్ళకు త్రాగడం అలవాటయి క్రమంగా వ్యసనమైంది...సుందరామయ్యగారికి. ప్రత్యేకంగా ఓ గది నిండా బ్రాందీ విస్కీ సీసాలుండేవి. నగలన్నీ కరిగి పోయాయి...అతని ఆనంద గుళికల్లా! అతని బంగళా ఇంకొకరు చేజిక్కించుకున్నారు...మనిషి జీవితాన్ని యముడు స్వాధీనం చేసుకునేటట్లు!

చివరికి తామిద్దరూ మిగిలారు. మనం మిగిలేం అనుకున్నట్లు చూసుకున్నారు. పైగా ఓ డాబ్జికారుకూడా వుంది...మృత్యు దేవతలా!!

త్రాగుడు విషయం...ఆఫీసులో పై అధికారుల చెవిన పడింది. అశ్లీలంగా పరిగణించి...వార్నింగ్ ఇచ్చారు. అది చెవిటివాని చెవిలో శంఖమూదినట్లే పనిచేసిందాయనకు. ఓ రోజు ఉద్యోగంకూడా తీశేసారు.

ఆ రోజు మిత్రులు హేళనగా మాట్లాడేరు.

"ముంజేతి కంకణమునకు అద్దమేల?" అన్నట్లు... ఏం జరిగిందో వేరేగా అడగాలా? అడిగేరు. కన్ను పొడిచి... "కన్నీరెందుకు కారుతుందోయ్?" అని అడిగి నట్లయింది.

జీవితంపై విరక్తి పుట్టింది. నైరాశ్యం ప్రభలింది! డాడ్జికారు "సర్" మంటూ దూసుకు పోతోంది. స్పీడు లిమిట్ దాటి పరుగెడుతోంది. తూలుతోంది... ఓ లారీని ఢీకొంది! కారు పిప్పి పిప్పి అయింది. బ్రద్దలయిన కుండలా!!

లారీ హెడ్ లైట్సు రెండూ విరిగిపోయాయి... కళ్ళు పోయిన కబోదిలా!

సుందర్... తల్లి తండ్రిలేని అనాధుడయాడు... త్రాడు తెగి... పుల్లలు విరిగిన గాలి పటంలా!

యాక్సిడెంటుకు కోర్టులో కేసు ఒక వైపు!

అప్పులవారి దావా ఇంకో వైపు!!

ప్రోవిడెంట్ ఫండ్‌లో వాటికి పోను... ఏదో— కొద్ది డబ్బు మిగిలింది... సుందర్రామయ్యగారికి. మిగిలిన దానిని... దగ్గిర వారైన శ్యామలరావుగారికి ఇచ్చారు తన పోషణార్థం!!

సుందర్‌ని... ఎస్. ఎస్. ఎల్. సి. వరకూ ఆయనే చదివించారు. కన్నకొడుకు కన్న మిన్నగా చూసుకునే వారు. మంచివారిని చూస్తే విధికి నవ్వులాటలా వుంటుందో ఏమిటో... అర్థాంతరంగా ఆయనకు గుండె జబ్బు చేసింది. ఎన్ని మందులో వాడారు. ఎంతో బాధను ఓర్చుకున్నారు. ఆఖరికి విధి తన పంతం నెగ్గించుకుంది.

వర్షపు తుంపర పడుతుండే ఓనాటి వేకువ ఝామున ... ఆయన ఆత్మ ఈ మాయా ప్రచ్ఛన్నలోకాన్ని వదిలి... శాశ్వతంగా... దూరంగా వెళ్ళిపోయింది.

సుందర్ కుమిలి కుమిలి యేడ్చాడు. ఈ జగన్నాటకంలో ... తన పాత్రను అమోఘంగా నిర్వహించి నిష్క్రమించారు... అనుకున్నాడు. ఆతని తదనంతరం ...వారి ఇంట్లో... గుదిబండలా వుండడానికి మనస్కరించలేదు సుందర్‌కు.

సుందర్ పరిస్థితినంతా క్లాస్‌మేట్ మధు అర్థం చేసుకున్నాడు. మదిలో మదన పడ్డాడు. సుందర్‌ను ఎంతగానో ఓదారుస్తూ... "దానిదానికి ఎదురుచూడ్డం—పోయిన దానికొరకు చింతించడం—కష్టము కల్గినపుడు దుఃఖించడం—సుఖం కల్గినపుడు పొంగిపోవడం—బుద్ధిమంతుల లక్షణం కాదు"రా... అని ఓదార్చాడు. కష్టాలను చిఱు దరహాసంతోనే ఎదిరించాలి! అదే వజ్రాయుధం!

అతనికి 'నా' అనే వారిలోకాన బహుశః వుండరేమో! మధుకి పందొమ్మిదేళ్ళుంటాయి. ఎఱ్ఱగా అందంగా హుందాగా వుంటాడు. వయసుకు మించిన ఆలోచనా పటిమ... సంస్కారభావాలూ... ఒక విధమైన మౌనం ...అతన్నో ప్రఖ్యాత రచయితగా తయారుచేశాయి. ప్రతిఫలంగా ప్రతినెలా ఎంతో కొంత ముడుతూనే వుండేది. స్టడీస్‌లో అతని మార్కులను చూసి... గవర్నమెంటు స్కాలర్‌షిప్ ఇచ్చింది.

ఓ సారి మధుకి "ఆంధ్రప్రభ" దీపావళి సంచిక కథల పోటీలో రెండవ బహుమతి వచ్చింది. సమయానుకూలంగా డబ్బు కుదరగానే ఇద్దరు మిత్రులూ కాలం వెళ్ళబుచ్చారు... లోటేమీ లేదనే అనాలిమరి! వీళ్ళను చూస్తూ అభినందిస్తున్నట్లుగా నవ్వుతూ కాలనాధుడు ముందుకు సాగిపోతున్నాడు. పబ్లిక్ పరీక్షలైపోయాయి. కొన్ని నెలల్లో రిజల్ట్సు వచ్చేశాయి. ఇద్దరి నంబర్లూ వున్నాయి.

హోటల్ ఊటీలో కాఫీ త్రాగి సెంట్రల్ లైబ్రరీకి వెళ్ళారు. హిందూలో ఓ ఎడ్వర్‌టైజ్‌మెంట్ పడింది "ఎయిర్ ఫోర్సు... పెర్మనెంట్" కమిషన్ అట! శిక్షణ పూర్తిచేస్తే పైలెట్ బ్రాంచిలో 475 రూ॥ నెలకు ఇస్తారు!

ఇద్దరికళ్ళూ మెరిసాయి సంతోషంతోనే!!

* * *

దగ్గర్లోవున్న పోలీసు ఠాణాలో మూడు గంటలు కొట్టారు. "అబ్బో! తెల్లవారనుందే!" అనుకుంటూ మళ్ళీ గతాన్ని ముందుకు తెచ్చాడు.

మధుకు 'రిటెన్ టెస్టు' వ్రాయడానికి 'కాల్' వచ్చింది. ఎంతో 'జనరల్ నాలెడ్జి' సేకరించి... పరీక్షకు వెళ్ళాడు. మళ్ళా... "మెడికల్ టెస్టుకు" పిల్చారు... వెళ్ళాడు. మళ్ళా "ఫైనల్"గా "ఓరల్ టెస్టు"కు వెళ్ళాడు "సెలెక్టు" అయ్యాడు.

మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు !!

1964 మల్టీకలర్ ఫోటో ఆఫ్ సెట్ మరియు కలర్ ట్రాన్స్‌ఫరెన్సీ,

పిక్చర్ కాలెండర్లకు

దయచేసి మమ్మల్ని సంప్రతించండి !!

టెలి: "కోరనేషన్" పి. బి. నెం. 2. ఫోన్ : నెం. 45.

దికోరనేషన్ లిథో వర్క్స్

(స్థాపితము : 1936)

శివకాశి [S. I.]

[ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే]

ఆ వేళ ప్లాట్‌ఫారంలోనికి యింకా ట్రైను రాలేదు. ఏడింటికి వచ్చింది బుసలు కొడుతూ...! సెకండ్‌క్లాస్ కంపార్ట్‌మెంటులో కిట్ బ్యాగ్ వుంచాడు మధు. ఇద్దరి శరీరాల్లోనూ...ప్రత్యణువూ బాధగా కొట్టుకుంటోంది. అయినా మధు...తన కవిత్వధోరణిలో యిలా అన్నాడు. "సుందర్! ఎందుకంత విచారం? మనమిప్పుడు భౌతికంగా విడిపోయినా...మంచి గంధపు వృక్షాన్ని పెనవేసుకుపోయిన నాగకుమారుల్లా ఆత్మలు విడి వడవురా!'' అని!!

అలా అంటూంటే అతని వదనం ఓ వింత తేజస్సుతో వెలుగంది పోతోంది. వింత అనుభూతిలో ఒకర్నొకరు కౌగిలించుకున్నారు.

పిడుగుపాటును మించిన శబ్దంతో ఘర్జించింది ధూమ శకటం! కాని వాళ్ళు త్రుళ్ళిపడలేదు. చలించలేదు. వారి ప్రాణస్నేహానికి హామీ ఇస్తున్నట్లే...గార్డు ఆకు పచ్చని 'లాంప్' గాలిలో ఊపుతూ విసిల్ వేశాడు.

"స్వాతంత్ర్య మాతృభూమి, కబంధ హస్తాలనడుమ చిక్కుకుండా...గాయపడిన భారత వీరులను...శత్రు సమక్షంనుండి "హెలీకాప్టర్ల"లో తీసుకువచ్చే మీ వైమానిక దళానికి నా శుభకాంక్షలురా!''

ఆనంద భాష్పాలు రాలుస్తూ అన్నాడు సుందర్.

తనచేతి వుంగరాన్ని...మధు చేతికి తొడిగాడు జ్ఞాపకంకోసరం సుందర్! ప్రేమగా చూస్తూ వుండిపోయాడు మధు!!

ట్రైను కదలింది. కూడా నడుస్తున్నాడు సుందర్! వేగం పెంచింది ట్రైను. సుందర్‌లో స్పీడు తగ్గింది. మధు కర్చీఫ్ ఊపుతున్నాడు. క్షణాలు దొర్లాయి. ఎవరికి ఎవరూ అగపడలేదు.

చీకటిలో కలిసిపోయింది రైలుబండి! చివరికి—చిట్ట చివరి పెట్టెవెనుక ఎఱ్ఱగా చిన్నగావున్న రెడ్‌లైటు మాత్రం అలా అలా దూరమై మాయమయింది. సుందర్ అలానే విచారంగా వెనుదిరిగాడు.

కొన్ని రోజులు భారంగా గడిచాయి. ఒకరోజు 20 రూ...టి. ఎమ్. ఓ. వచ్చింది. మధు పంపాడు. వెంటనే ఓ పూరిల్లు అద్దెకు తీసుకుని తన జీవిత నౌకను కొనసాగిస్తున్నాడు సుందర్!

మధు దగ్గరనుండి వారంకో వుత్తరం వచ్చేది. "పారాచూట్" జంపింగ్ నేర్పిస్తున్నారట తనికి! నెల నెలా ఏదో కొంత డబ్బు పంపేవాడు.

ఓ రోజున ఒక వింత సంఘటన జరిగింది. అలవాటు ప్రకారం నిద్రలేచాడు సుందర్. కాని తన కళ్ళనుతానే నమ్మజాలనంత ఆశ్చర్యకరమైన సంఘటన! ఆందోళనతో అరుగంతా కలియజూశాడు.

ఓ పసిపాప చలన రహితయై పడివుంది. క్షణంసేపు స్థాణువైపోయాడు. ఆ పాపను ఎత్తుకుని అదే వీధి చివర వున్న డాక్టర్ శేఖర్ దగ్గరకు తీసుకెళ్ళాడు. అంతా పరీక్షించి చూశారు శేఖర్ గారు, "మిష్టర్! ఈ పాప విషయంలో యింత నెగ్లక్టు ఎందుకు చేశారు? ఇంకో గంట లేటయివుంటే......నా సాధ్యంకాకపోను." అంటూ ఓ ఇంజెక్షన్ చేశారు.

స్త్రీ హృదయం అతిసున్నితం అంటారే...మరి ఈ మాటలేరాని చిట్టి పాపను వదలిన 'స్త్రీ'...మనిషా పశువా?? "తాను వేసిన విషపు వృక్షాన్నయినా... తాను నరికి వేయుట మంచిపని కాదు." అన్నారు ఆర్యులు. నారువేస్తే నీరుపోసి తీరాలి. రక్షించడానికి శక్తిలేకపోతే సృష్టించడం మహాపాతకం. ఈ విషయంలో తల్లులెందుకింత ఘోరం చేస్తున్నారు...ఎంతో విచారించాడు సుందర్.

డాక్టర్ శేఖర్ చల్లని హస్తాలలో పాపకు స్వస్థత చేకూరింది. కిలకిల నవ్వులతో ముద్దు మాటలతో తిరుగుతోందిపాప. పాపకోసరం ఎవ్వరూ రాలేదు. మరి సుందరే ఆ పాపకు "విశాల" అని పేరు పెట్టి పెంచాడు.

.........ఆ విశాలే నేడు "సైకిలు కొనివ్వమంటూ" కలవరిస్తోంది. తనెలాగయినా శేఖర్ గార్నే అప్పు అడిగి...సైకిల్ కొనివ్వాలి ఓ నిర్ణయానికి వచ్చాడు.

విశాల ఇంటికి రావటంతోనే సుందర్ కి వుద్యోగం కూడా వచ్చింది. ఆ వేళ డా॥ శేఖర్...తన వ్యక్తిగత విషయాలన్నీ అడిగి మరి తెలుసుకున్నారు. కాసేపు గంభీర ముద్రదాల్చి పైప్ వెలిగించారాయన.

"సుందర్! నీ కభ్యంతరం లేకపోతే..." అంటూ ఆగారాయన! ఆయన వదిలిన అల్లీబిల్లీ పొగల మేఘాల్లోకి అయోమయంగా చూస్తున్నాడు సుందర్! "—ఇక్కడే నువ్వు కంపౌండర్ గా వుండవోయ్!... నేను అన్నీ చెప్తాను. ఏమంటావు?" ప్రశ్నించారు.

సుందర్ ఆయన మాటలకు అడ్డు చెప్పలేకపోయాడు నెలకు జీతం 60 రూ. బాగానే వుందిగాని, "తాదూర గంతలేదు... మెడకొక డోలా??" అన్నట్లు ఓ 20 రూ. అతనికే ఇచ్చేయాలిట!...అయినా..."సమ్‌థింగ్ ఈజ్ బెటర్ దేన్ నథింగ్ లే" అంటూ ఒప్పుకున్నాడు.

ఎవ్వరూ అరవమనకుండానే కుక్కుటం "కొక్కరో" మంటూ ... నిద్రకైపులోని జనాలిని మేల్కొలిపింది. "కావ్...కావ్" మని కాకులు...కిచకిచమని పక్షులు ...వాటి అరుపులు నిర్మలమైన వేకువగాలిలో స్పష్టమై కర్ణపుటాలను తాకుతున్నాయి.

విశాల నిద్ర లేచినట్లుంది. అరుణుడి తరుణ కిరణాలు విశాల బుగ్గలపై పడి మెరుస్తున్నాయి.

"స్వంతలాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడు పడవోయ్!
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్!"

అంటూ విశాలవల్లె వేస్తోంది. ఛెంగున లేచి కూర్చున్నాడు సుందర్. అతని చెవుల్లో గురజాడ ముత్యాలసరాలు గింగుర్లే అన్నాయి. హుషారుగా లేచి విశాలను ముద్దు పెట్టాడు...అయినా రాత్రంతా నిద్రలేదేమో చికాగ్గా వుంది.

అతని రెండు కళ్లూ శోణార్ధమై...భయంకరంగా వున్నాయి. ఇద్దరూ కొచ్చిన్ కేఫ్‌లో టిఫెన్ చేశారు. విశాల బడికి వెళ్ళిపోయింది. డిస్పెన్సరీవైపు నడిచాడు సుందర్.

"నమస్కారమండీ!" అన్నాడు సుందర్.

"ఆ! రావోయ్! ఈవాళ ఆలస్యమయ్యేవ్..." అంటూ చిఱునవ్వుతో సూటిగా సుందర్ ముఖంలోనికి చూశారు. "ఏమోయ్ కళ్లెర్రగావున్నాయ్!" అన్నారు. నవ్వు ఊరుకున్న సుందర్ వదనంలోని విషాదవలయాన్ని ...అనుభవంతో అర్ధంచేసుకున్నాడు డాక్టర్!

"రాత్రి నిద్ర పట్టిందా? ఎలా పడుతుంది? గత జలసేతు భంధనం" లాభం లేదయ్యా? చూడూ...

తుమ్మెద "ఝూం" అని రొద చేస్తుంది. కాని 'సంపెంగ' పువ్వు వింటుందా? దాన్ని?? కాని భ్రమరం పట్టుబట్టి సంపెంగను చేరిందా... దాని ఘాటుతగిలి మూర్ఛపోతుంది. అలాగే... గత స్మృతులనే రొదను వినకుండా సంపెంగలా నిగ్రహంగా వున్నావంటే... భ్రమరం మూర్ఛపోతుంది... అర్థం కాలేదోయ్ నా మెట్ట వేదాంతం?? అదేనోయ్ మరి!... మనిషికి 8 గం. నిద్ర అవసరం!"

"అదికాదండీ..." ధైర్యం చాలక ఆగాడు సుందర్. 'ఆఁ ఆఁ! ఏవిటోయ్? చెప్పుమరి సిగ్గుపడక...' 'నాకో ముప్ఫయి రూపాయలు అప్పు కావాలండీ...' అంటూ విశాల చాలాసార్లు తనను సైకిల్ కొనమంటూ అడిగిందనీ చెప్పాడు.

అతని గొంతులోని ఆరాటం—చూపులోని దైన్యత ... శేఖర్‌కు కనిపించి వినిపించాయి.

"నిల్చునే వున్నావ్... అలా కూర్చోవోయ్ మరీ చాదస్తుడివి..." సోఫా చూపించారు.

సుందర్ కూర్చున్నాడు.

పొగవదుల్తూ ప్రారంభించారాయన.

'నీవిక్కడ జోయిన్ అయి విజయదశమికి సరిగ్గా 5 సంవత్సరాలయింది. ఇన్నాళ్లూ నీ దగ్గరనుండి... 20 రూ. ఎందుకు తీసుకుంటూన్నానో తెలుసా? భవిష్యత్తులో నీ యశస్సుకొరకే! ఇప్పటికది పన్నెండు వందలు కూడింది...' ఆగి జేబులోనుండి చెక్‌బుక్ తీసి... 100 రూ॥కు చెక్ వ్రాసి... 'ఇఁదా! ఇది ఖర్చుపెట్టు...' అని ఇచ్చారు.

ఎంత దయార్ద్ర హృదయులు అనుకున్నాడు మనసులో! పట్టరాని సంతోషం వచ్చింది. దేవునిలాంటి అతణ్ణి ఎలా ప్రసంశించాలో తెలియక మాటలకోసరం వెతుక్కున్నాడు.

అంతలో ఆయనే కల్పించుకుని... 'వెళ్ళవోయ్... ఈవాళ నీకు 'హాలీడే'... లౌక్యంగా నవ్వుతూ అన్నారు.

"మీ మేలు మరచిపోలే'నంటూ... అనబోయి సగంలో ఆగిపోయాడు సుందర్.

అందమునకు
సుఖమునకు
సరియైన కొలత,
మంచి నేతకు...

వీనస్

బనియన్లు ధరించండి !!

ఫోన్ నెం.
235




టెలిగ్రాం :
"వీనస్"

ఆంధ్ర ఏజెంటు

యన్. వి. సుబ్బారావు

శ్రీనివాస టెక్స్టైయిల్స్ : : పెడన (క్రిష్ణా జిల్లా)

'రిక్లెయినింగ్' సీటులో చారబడిన శేఖర్ గారు... 'పరవాలేదోయ్ వెళ్లు'. అన్నారు. అదీ నిజమే నన్నట్లుగా గోడ గడియారం తంగుమంది. చూస్తే పదిన్నరైంది! 'వస్తానండీ' అంటూ నమస్కారం చేసి వెనుదిరిగాడు సుందర్.

దూరంగా...పోస్టుమాన్ చేతిలోని వుత్తరం అందుకుంటూన్న విశాల అగపడింది. పరుగు పరుగున వచ్చాడు సుందర్.

వుత్తరం మధు దగ్గిరనుండి వచ్చింది. ఇన్నాళ్లూ 'ఎయిర్‌మెన్'గా వుండే వాడట...ఇప్పుడు ఏవో పరీక్షలు పాసయి...'పైలెట్ ఆఫీసర్'గా సెలెక్టు అయాడట...ట్రైనింగుకు వెళ్తున్నాడట! పాపాయి విశాలకి శుభకాంక్షలు...ఏవో బహుమానాలు పంపుతునాట్ట!

సంబర పడిపోయాడు సుందర్. ఆవేళ పండగలా వుంది.

మర్నాడు విజయదశమి! ఓరోజు ముందే శలవిచ్చేశారు శేఖర్ గారు. సైకిల్ కొంటున్నట్టు విశాలతో చెప్పాడు సుందరం. సంతోషంతో ఉక్కిరి బిక్కిరి ఐ..."ఔతే సాయంత్రం 'ఒంటి బెల్'కే వచ్చేస్తా!" అంటూ బడికి పారిపోయింది.

సుందర్ 'చెక్' మార్చడానికి బ్యాంకుకు వెళ్ళి నెం. 12 ఎస్.ఆర్.ఎమ్.టి. లో తిరిగి వచ్చేశాడు. అప్పుడే ఒంటిగంటై పోయిందని హాయిగా నిద్రపోయి ...మూడు గంటలకు లేచాడు. డ్రెస్ వేసుకుని టౌన్లోకి బయలు దేరాడు...!

విశాలకు మూడు చక్రాల సైకిల్ కొన్నాడు. మంచి బట్టలు కొన్నికొన్నాడు. ఏవేవో ఆటవస్తువులూ... స్వీట్సూ కొని రిక్షామీద బయలుదేరాడు.

అతని మనసు ప్రశాంతంగా వుంది మబ్బులు తొలగిన చందమామలా!

నాలుగు గంటలు అప్పుడే అయింది...రెయిల్వే సైరన్...'బొం...'మంది! ముద్దుల విశాలకు ఎంత త్వరగా సైకిల్ యిద్దామా అని ఆతృతగావుంది. లేగ దూడ పట్ల గోమాతలా!

పూర్ణా థియేటర్ దగ్గిర కె. సి. చారిటీస్ ఫండ్ గురించి యాంప్లిఫైర్ 'కాన్వాస్' చేస్తోంది.

ముందుకు సాగే రిక్షా మలుపు తిరిగింది. సరస్వతీ జంక్షన్ దాటేసింది. సుందర్‌లో హృదయోద్వేగం చెలరేగుతోంది. ఏవేవో ఆలోచనల్లో పరధ్యాన్నం పాలు పంచుకుంది.

'పోంయ్...పోంయ్...!' కార్ హారన్! ఆలోచనలకు అఘాతమే అది!

'ఏయ్...పాపాయ్...!' అదో వెర్రికేక.

'అన్నాయ్!...' ఇదో ఆర్త నాదం!

ఒక్కసారిగా చెవిలో రిక్షా గంటల గణగణలు మార్మోగేయి. త్రుళ్ళిపడి డిల్లపోయాడు.

'ఆపు...!' సింహఘర్జన చేశాడు. రిక్షా దూకాడు.

అతని హృదయం శతాశనిఘాతముల పెట్టున బ్రద్దలై అయ్యింది. వ్యధ రగిలింది. ప్రేమక్షుద జ్వలించింది. ప్లిమత్ కారు ముందుచక్రం విశాల మీదినుంచి పోయింది. ఆరక్తపు మడుగులో విశాల...ముఖంపై చిరునవ్వు వుంది...కాని అది జీవంలేని కాయం!

కళ్ళు చెదిరి స్మారకం కోల్పోయాడు. ఎవరో శైత్యోపచారం చేశారు. తేరుకుని చూశాడు.

రిక్షాలోనే వుంది తను కొన్న సైకిలు. అశ్రుధారలు కాల్వలయ్యాయి. హృదయస్పందన జోరుగావుంది. కష్టంపై ఏడుపు ఆపుకున్నాడు. మానవునకు మృత్యువు సహజమే! తను ఏడిస్తే చెల్లాయి తిరిగివస్తుందా? అయినా పసిపాపకా దుర్మరణం! హే భగవాన్!

* * *

అది డా॥ శేఖర్స్ డిస్పెన్సరీ.

బెడ్ మీది వ్యక్తి బాధగా మూలుగుతున్నాడు. ఒళ్లు సలసలా కాగిపోతోంది. టెంపరేచర్ చూసి ఓ ఇంజెక్షన్ యిచ్చారు శేఖర్ గారు. మధ్యమధ్య బాధగా ఏవో కలవరింతలు ఆ సుందర్ నోటిగుండా వినవస్తున్నాయి. అవి విన్న శేఖర్ గారు బాధపడేవారు.

ఓ నెలరోజులయాక...

ఓనాడు డాక్టర్ శేఖరంగారు స్వయంగావచ్చి సుందర్ బెడ్ ప్రక్క కూర్చుని 'సుందర్' అని పిల్చారు.

లేవబోయాడు సుందర్. 'లేవకోయ్! చూడూ నీతో ఓ విషయం మాట్లాడాలి' అన్నారు.

'మీ ఇష్టమే తరువాయి' అన్నట్లే చూశాయి సుందర్ కళ్ళు.

'సుందర్ నామాటపై నీకు సంపూర్ణ విశ్వాసముంది కదూ? నాదో కోరికవుంది. నేనెలాగూ వయసుమళ్ళిన వ్యక్తిని. ఏనాడో మా శ్రీమతి నన్నూ నాగరాజ్‌నూ ఒదిలి వెళ్ళిపోయింది. తరువాత నాగరాజూ చిన్నప్పుడే నూరేండ్లు నింపుకున్నాడు. నిన్ను చూస్తుంటే మా నాగరాజే గుర్తొస్తున్నాడు. నిన్నూ నన్నూ ఏ రాగ బంధమో—కట్టివేసింది. నిన్ను నేను చదివించదలచు కున్నాను. నామాట కొట్టిపారేయకు. వెంటనే 'పి.యు.సి.' లో జాయిన్ అవు. 'బైయాలజీ' లో 60 మార్కులొస్తే చాలు ... నిన్ను 'యమ్. బి. బి. యస్.' చదివిస్తాను. నువ్వూ నా అంత డాక్టరువయ్యేదాకా నేనుంటాను సుందర్...' ఆపి...ఆత్రంగా చూశారు... సుందర్ వైపు.

సుందర్ వింతగా అదో మాదిరిగా చూస్తున్నాడు. అతనికంతా అయోమయంగావుంది. చివరికి తేరుకుని 'క్షమించండి—' అనబోయాడు. ఇంతలో కాలింగ్ బెల్ 'ట్రింగ్ ... ట్రింగ్' మని రింగ్ చేసింది.

'ఇక మరేం బిజినెస్ లాభంలేదు సుందర్! నీకు వేరే చెప్పనవసరంలేదు' అంటూ చకచకా బయిటికి వెళ్ళిపోయారు శేఖర్‌గారు.

ఇంతటి విశాలహృదయునికి తనెలా ఋణం తీర్చుకో గలడు? అని ఆలోచిస్తూ కూర్చున్నాడు సుందర్. దేవుని లాంటి ఈ లక్షాధికారికీ తనకూ ఏమిటీ రాగబంధం? అనుకుంటూ 'కథాంజలి' రజతోత్సవ సంచిక తిరగేస్తూ కూర్చున్నాడు.

* * *

మానవుల సుఖదుఃఖాలు...కష్టనష్టాలతో ఏ సంబంధమూ లేని కాలవనిత ముందుకు సాగిపోతోంది.

కాలగర్భంలో నవవసంతాలు దిగంతాల అనంతానికి దొర్లుకుపోయాయి. శేఖర్ చేతిమీదుగా 'సుందర్, రజియాల వివాహం ఆవేళే జరిగింది. రజియాకూడా తనతోటి డాక్టరే...కాని ముస్లిమ్‌యువతి.



హైదరాబాద్ మరియు తెలంగాణా ప్రదేశానికి ఏజంట్లు : ప్రభాకర్ ఏజన్సీస్, విజయవాడ.
ఇతర ఆంధ్రప్రదేశానికి ఏజంట్లు : విజయా ఏజన్సీస్, విజయవాడ.

డాక్టరుగారు మతాంతర వివాహానికి ఒప్పుకున్నారు. వరకట్నమూ నిషేధించబడింది. ఆవేళే 'ఎయిరోప్లెయిన్' లో పైలెట్ ఆఫీసర్ 'మధు' వచ్చాడు. అతనితో 'సాధన్ గౌరి' అనే బెంగాలీ అమ్మాయి వచ్చింది.

సాధన్ గౌరి 'ఎయిర్ హోస్టెస్' గా పనిచేస్తోంది. ఇద్దరూ ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు.

ఒకరినొకరు పరిచయం చేసుకుని ఆనందంలో మునిగిపోయారు ఆరోజు.

గార్డెన్ రకరకాల పువ్వులతో ఎంతో అందంగా వుంది. ధారలు ధారలుగా రంగులు రంగులతో నీరు చిమ్ముతోంది ఫౌంటెన్!

పారుజాతం వృక్షాల వెనుకనే సోఫాలు వేయబడి వున్నాయి. అంతా కూర్చున్నారు.

సన్నసన్నగా లతామంగేష్కర్ ట్యూన్ వినిపిస్తూ ఆహ్లాదం చేకూరుస్తోంది.

బట్లర్... ట్రేలో కాఫీ టిఫెన్ పెట్టి తీసుకొచ్చాడు. స్వచ్ఛమైన హృదయాలతో హాయిగా మాట్లాడుకుంటున్నారు వాళ్ళు.

ఇంతలో ఏడేండ్ల ఓ పాప కాన్వెంట్ నుండి వస్తూ 'నమస్తే డాక్టర్' అంది అటువైపు చూశారంతా! ఆ పాప సిగ్గుపడి వెళ్ళిపోబోతూంటే సుందర్ పిల్చాడు.

ఇదివరకు ఆ పాపాయి అరుణకు ఏదో యాక్సిడెంట్ లో గాయాలు తగిలితే సుందర్ ట్రీట్ చేశాడు. ఇప్పుడు ఆరోగ్యంగానే వుంది.

అరుణను చూసినప్పుడల్లా సుందర్ కి విశాల గుర్తుకొచ్చేది. 'అరుణా' అంటూ డాక్టర్ సుందర్ ఆపాప తల నిమిరాడు. అతని నేదో వ్యక్తంకాని రాగబంధం పెనవేసినట్లయింది. విశాలమదిలో మెదిలింది.

నేత్రాలు జలపూరితములై అడ్డుపడిన నీటి పొర గుండా అరుణముఖంలోనే విశాల నవ్వుతూ అగపడింది. అప్రయత్నంగా చెక్కులపై జారిపడే కన్నీటిని అర్థంకాని అరుణ అమాయకంగా తుడిచింది తన చిట్టి చేతులతో!

రజయూతూ... సాదన్ గౌరికి తప్ప మిగతావారందరికీ ...అంటే డా॥ శేఖర్ మధులకు సుందర్ బాధ అర్థమయింది.

కొబ్బరిఆకులు భారంగా వంగిపోయాయి. అతని బాధకు సానుభూతిలా! పెద్దగాలికి కొన్ని పారుజాతం పువ్వులు శేఖర్ ఒడిలోనూ అమల తలపైన పడ్డాయి.

ప్రేమగా సుందర్... ప్లేటులోని ఓ కేకును తీసి ప్రియంగా అరుణ నోటిలో పెట్టి నవ్వాడు.

గార్డెన్ లో ఒక్కసారిగా లైట్లు వెలిగాయి. వెంకటేశ్వరుని గుడిలో ఖంగున గంటలు మ్రోగాయి!

